# సోషలిస్టు

## పి.వి.ఆర్. శివకుమార్



ఉదయం నిద్రనుంచి లేస్తూనే, ఈ నెలనించీ నేను వన్ పర్సెంటు జీతాన్ని 'బిచ్చగాళ్ళ' కోసం కేటాయిస్తున్నానని ప్రకటించినప్పుడు మా ఆవిడ ముఖం చిల్లిగవ్వంతైయిపోయింది.

అవును మరి, ఒకటికాదు - రెండు కాదు. నెలకు పదిరూపాయలు - అఫ్టరాల్ బిచ్చగాళ్ళకోసం - ప్రతీనెలా ఖర్చుపెడతానన్నాను మరి!

"అదేవిటండీ? వున్నట్టుండి అలాంటి నిర్ణయం తీసుకుంటున్నారూ? అంతడబ్బు ఎక్కువైపోతే, ఆ పదితోనూ ఓ రికరింగు డిపాజిట్టు ఓపెన్ చెయ్యండి చంటాడి పేర్న! అంతేగానీ " అంది.

అవును, దానికంతే తెల్సు! షి డిజ్ లైక్స్ బెగ్గర్స్ ఆ 'యిది' నాకూ వుండేది మొన్నటిదాకా మొన్న సాయంత్రం ఆ సంఘటన జరిగేదాకా..

* * *

నాకు నిమ్నస్థాయి మనుషులంటే అసహ్యం వాళ్ళ చేష్టలూ, లేకి ప్రవర్తనా అలాటి అసహ్యం నాలో కలిగిస్తాయి. (వాళ్ళ ఆ ప్రవర్తనకి కారణం మాత్రం ఎన్నడూ ఆలోచించలేదు నేను।) ఇహ బిచ్చగాళ్ళ సంగతి వేరే చెప్పే అవసరమే లేదు. మన ప్రభుత్వం ధర్మమా అని— డిస్కరేజ్ బెగ్గర్స్ అన్న ముక్కని నేను అక్షరాలా పాటిస్తాను.

తక్కువజాతి మనుషులు మన సరసన నిలవటానికూడా పనికిరారని నేనంత గట్టిగా అనటానికీ, అనుకోవటానికీ మరో ముఖ్యకారణం మా సీతాలు।

సీతాల్ని చచ్చినట్టు 'మా సీతాలు' అంటూ సంబోధించాల్సిందే। కారణం అది మా పనిమనిషి పెళ్ళాన్ని సవ్యంగా చూడకపోయినా పర్లేదేమోగానీ, పనిమనిషిని సవ్యంగా చూడకపోతేమాత్రం మన పాట్లు వీధికుక్కలుగూడా పడవ్।

ఆ వూరొచ్చినప్పట్నుంచీ, సీతాలు కుదిరేదాకా మారిన అరడజనుమంది సర్వెంటు మెయిడ్సూ జమిలిగా నాకీ అనుభవంనేర్పి వెళ్లేరు। అంచేతే సీతాలు వచ్చిన దగ్గర్నుంచీ - దాని బిహేవియర్ నాకేమాత్రం నచ్చకపోయినా - దాని పనితనం మా ఆవిడకి బాగా నచ్చటంతో - దానితో మంచిగానే వుంటున్నాను నేను. (అబ్బే, మరేంలేదు. దాన్ని కసురుకోకుండా, అసలు మాట్లాడకుండా మన ధోరణిలో మన ముండటమే।)

సర్లే, యింతకీ సీతాలు మనసరసన్నిలబట్టానికూడా పనికిరాదని చెప్తున్నాను కదూ। అవును. ఎంచేతంటారా - మొదట అది సర్వెంటు. కాకపోయినా, కొందరు సర్వెంట్లయినాయజమాన్లకన్నా స్టయిలిష్‌గా ఫోజిచ్చేస్తారు ఐ లైక్ దేమ్ - ఇన్ ఫాక్ట్ డబ్బువుండే తీరక్కర్లేదు, రాజు కావటానికి। రాజయ్యే గుణమున్నవాడికి అదే పెద్ద సంపద।

కాన్నీ, మా సీతాలు ఫక్తుమనిషి. ఆ ముక్క దానికి నిద్దర్లోగూడా గుర్తుంటుందనుకుంటాను. (మా ఆవిడకి తృప్తిగా నిద్రపట్టనినాడు, అదిగూడా మాగన్నుతోనే కునుకుతుందేమోనని నా అనుమానం।) పైగా, దానిబుద్ధులుగూడా అలాంటివేను।

నిజానికి అందరు పనిమనుషులంత పేద ముండ కాదది. దాని మొగుడు - మా ఆఫీసులోనే ప్యూన్। నెలకి నూటయాభై దాకా వస్తాయి వాడికి. అది మాకాలనీలో అధమం అయిదారిళ్ళలో పన్చేస్తోంది. అంటే, నెలకి అరవై డభై ఏనాకా సంపాదిస్తుందన్నమాట।

వాళ్ళ సంసారమూ అంత పెద్దదికాదు (ట।) ముగ్గురు పిల్లలూ, అత్తామామా। వాళ్ళూ ఏదో బుట్టలల్లీ, తట్టలల్లీ సంపాయిస్తారు.

అయినా దీనిబుద్ధిమాత్రం దరిద్రపు బుద్ధే।

అలాగని అంత పిసినారిదీ కాదు మళ్లీ।

ఏవైనా పైపన్లు - పిండిరుబ్బటమో, మరపట్టించుకురావటమో, బియ్యం బాగు చెయ్యటమో లాటి అదనపు డ్యూటీలు - చేయించుకుని, మా ఆవిడ ఏ పావలో దాని చేతిలో పడెయ్యబోయినా మొగమాటపడి చచ్చేది మొదట్లో పుచ్చుకోవటానికి। కొంపలో ఎవ్వరమూ లేకుండా తాళాలు

దాని చేతికిచ్చి, బజార్లకీ, సినిమాలకి వెళ్లిన రోజులున్నాయిగానీ, ఒక్క చీపురుపుల్ల గూడా స్థానం కదిలిన సంఘటనలేదు.

అంత నిజాయితీ, నిర్మలతా, మొగ మాటమూ వున్నదానికి ఆ 'కక్కుర్తి బుద్ధి' ఎందుకో మాత్రం నాకర్థం కాలేదు.

తిండిలేక, వస్తులు పరుండేవాళ్ళుగూడా చేయ (రని నేననుకునే) ని 'ఆపని' ఆదెం దుకు చేస్తుందో నాకు వూహకందలేదు.

ప్రతిరోజూ పన్లోకి వచ్చేటప్పుడు ఆ అల్యూమినం బేసిన్ తెచ్చుకుంటుంది.

అంట్లు తీసుకోగానే, అందులో మిగి లిన అన్నమూ, కూరలూ - ఏవైనా సరే - అబగాతీసి అందులో వేసుకుంటుంది.

అంతవరకూ ఫర్వాలేదు సహజంగా ప్రతిపని ముండకీ వుండే అలవాటే కానీ, గిన్నెల్లో వదిలిన అన్నమూ, కూరలేకాక, కంచాల్లో - పీళ్ల పోసయినాసరే - వదిలిన 'ఎంగిలి కూటి' కూడా కక్కుర్తి పడు తుందది!

ఒక్కసారి చూశాన్నేను, బాతురూం లోంచి వస్తూ! కంచాల్లో వదిలేసిన ఎంగిలి మెతుకులు తీసి, ఆ బేసిన్లో విడిగా పెట్టు కుంటోంది.

నామీద గొంగళి పురుగులు పాకినట్ల యింది! లోపలికి వెళ్తూనే మా ఆవిణ్ణి కేకేశాను—

"ఏమిటోయ్, ఆ సీతాలు చేస్తున్న పని? దరిద్రంగా ఆ ఎంగిలి కూటికోసం కూడా ఏమిటా కక్కుర్తి? అందరి ఎంగిలీ తిని, ఏ రోగాలో తెచ్చుకుని ఆ రోగిష్టి వంటితో మన కొంపకి పన్లోకొస్తే ఛీ ఛీ .. డర్టీ బగ్గర్!

దానిచేత ఆ పనయినా మాన్పించు. లేదా మనపనయినా మాన్పించు

అయ్ కాంట్ టాలరేట్ సచ్ థింగ్స్'

అంటూ సివియర్ వార్నింగోటి పారే శాను.

కానీ రెండూ జరగలేదు, సీతాలు మా యింటిపనీ, దాని అలవాటు పనీ, రెండూ చేస్తూనే వుంది! దాని బ్లడీ సిన్సి యారిటీ ఎండ్ అలర్ట్‌నెస్‌లే దాన్ని కాపాడు తున్నాయి పనిపోకుండా! మా ఆవిడ, దాని విషయంలో నన్ను సైతం ఎదిరించింది.

'పోనివ్వండి, పనిముండ మనకేం పోయింది దాని కక్కుర్తివల్ల? ఆ ఒక్క కారణాన దాన్ని పనిమానిపిస్తే - తిర్వాత సరైన పనిమనిషి దొరక్క నే నిబ్బంది పడాలి' అంటూ

నే నూరుకోకతప్పలేదు.

కానీ, అప్పట్నుంచీ అదంటే నాకు పరమ అసహ్యం ఏర్పడింది.

(అంతకు ముందుదాకా అది నా గది తుడవటానికి వస్తే నాకో 'డర్టీ అట్రాక్ష నుం'డేది వంగి, వంగి అది గదిలో మూల మూలలా తుడవటమూ, మధ్య మధ్య జారిపోయే పైట మార్చి, మార్చి సర్దుకుంటూ అవస్థపడటమూ, మంచి యవ్వనంలో వున్నదాని శరీరం నా కళ్ళకి విందు చేయటమూ, అదో మత్తయిన (దొంగ) అనుభవంగా వుండేది.

కానీ, యీ ఎంగిలి కూటి విషయం చూసినదగ్గర్నుంచీ, దాని వంట్లో ప్రవ హించే రక్తమంతా ఎంగిలిదేమోననీ, దాని శరీరంలోని వంపులన్నీ ఎంగిలివేననీ, ఎంతో అసహ్యం కలగసాగింది.

దాన్ని చూడాలంటేనే అసహ్యం వేయటంతో, అది గది తుడవటానికి వస్తూనే, నేను రూములోంచి బయటకు వెళ్ళిపోసాగేను.)

*           *           *

సడెన్‌గా స్కూటర్ ట్రబులిచ్చింది.

ఉదయం వచ్చేటప్పుడు బాగానేవచ్చింది. సాయంత్రానికి మరి ఏం జబ్బుచేసిందో!

విసుక్కుంటూ దాన్ని అక్కడే వొది లేసి, రోడ్డుమీది కొచ్చేను. ఒక్క ఆటో గూడాలేదు స్టాండ్‌లో! అవసరం కదా మరి - వుండవంతే! అనవసరంగా టాక్సీ ఎక్కడం యిష్టంలేకపోయింది ఒక్క మనిషి కోసం!

సరే, రిక్షా పిల్చాను. ఎక్కాను.

బడబడా వాగేస్తూ, హ డా వి డి గా తొక్కేస్తున్నాడు - రిక్షావాడు, కుర్ర వెధవ, హుషారుగా వున్నాడు!

"అరె . అరె ఇదేం దారయ్యా? యిటు పోనిస్తున్నావ్?" అన్నాను, ఏదో ఎరగని సందులోకి మళ్లిస్తున్న వాడితో, కంగారుగా.

"ఫర్లేదుసార్ అడ్డదారే అయినా, దగ్గిరిదారి! అయిదే నిముషాల్లో యింటి దగ్గరుంటాం."

అంటూ పెడల్ వెయ్యసాగాడు.

ఆ వీధి ఎన్నడూ చూడలేదు నేను.

అవును, ఎలా చూస్తాను? అలాంటి వీధులు నాకసలు పడవు.

దేశంలోని దరిద్రానికి స్పెసిమెన్స్ ఆ వీధీ - ఆ మనుషులూ.

పూరిగుడిశెలు, రోడ్డుపక్కని బతుకులు, మనుష్లలాటి శవాలు! అవయవాలన్నీ సక్రమంగా అమరని వికృతరూపులు: కుష్టు, బొల్లి యింకేవేవో పేర్లు తెలియని రోగాలతో, రసికారుతున్న పుళ్ళతో, చూడ శక్యంకాని మనుషులు!

బిచ్చగాళ్ళ గూడెమన్నమాట! అయితే, యిలాటి గూడేలుగూడా యిరవయ్యేళ్ళ తర్వాత యింకా వున్నాయన్నమాట!

కడుపులో దేవినట్లయి, కళ్లు మూసుకోబోయి, హఠాత్తుగా కనబడ్డ మరో దృశ్యంతో దడాలున ఆగిపోయాను.

అక్కడ అక్కడ కనబడ్డ వ్యక్తి - సీతాలు,!

అది చేస్తున్న పని నాకు మరింత భ్రాంతి కలిగించింది.

దాని అరచేత అక్షయ పాత్రలా అల్యూమినియం గిన్నె!

వరసగా కూర్చున్న బి చ్చ గా ళ్ళ ముందున్న పిబ్బెల్లో ఆ 'ఎంగిలికూటిని' (అనుకుంటాను) తీసి వడ్డిస్తోంది! ఆబగా దాన్ని నాకేసి, మళ్ళీ జాపుతున్నారు ఆ మనుషులు (?)

చూస్తుండగానే దాని బేసిన్ ఖాళీ అయిపోయింది.

తిన్నవాళ్ళ దీవెనల్ని వినకుండానే, ఆ అన్నదాత, బేసిన్ తీసుకెళ్ళి దూరానవున్న కుంటలో తొలుస్తోంది!

"ఏటండి సూత్తన్నారు? దాన్నా- అది సీతాలనండి మహా దొడ్డమనిషి లెండి! రోజూ రెండుపూట్లా యిట్టాగే అన్ని యిళ్ళలోంచి కూడుతెచ్చి, సంతర్పణ సేత్తదండి! అది పనిమనిషిలెండి సాలా మంది దొరబాబులయిళ్లలో! ఆళ్ల కేటండి! పారేత్తారు. అదే యీళ్లకి పరమాన్నం-

ఆనాడు మోహిని దేవతలకేంపంచిందో తెలవదుగానండి-ఇదిమాత్రం యీ దరిద్రు లకి అమృతవే( పంచుద్దండి! ఆళ్ళబతుకుల కది అమృ_ర్తవే( లెండి!

రోజెట్టేకూడే గాదండి-ఏడాదికోపాలి ఆళ్లకి బనీన్లుగూడా కుట్టిపంచుద్ది. అప్పు డప్పుడెవళ్ళయినా యిత్తే, గుడ్డలు గూడా తెచ్చి_స్తది!

మా దొడ్డబుద్ధి

చెప్తున్నాడు రిక్షావాడు.

రిక్షా ఆ వీధిని దాటేసింది.

* * *

అరాత్రి పడుకున్నా నాకు నిద్రపట్ట లేదు. కలగాపులగంగా పీడ (?) కలలు! పాడుదృశ్యాలూ!!

సంపాదించేది పదుల్లోనైనా, వందల జీతగాళ్ళలా సీతాకోకచిలుకల్లా అలంక రించుకుతిరిగే (యిదివరకు మా యింట్లో పనిచేసిన) ఎందరో (పని)మనుషులు!

వందల్లో సంపాదిస్తూ కూడా, పేదగా-అతిసాదాగా-బ్రతుకుతున్న సీతాలు!

గిన్నెలగ్గిన్నెలు వొండుకుని, తిన్నంత తిని, తూముల్లోకి విసిరే యిల్లాళ్ళు—

కంచాల్లో నానిపోయిన ఎంగిలికూటిని తీసి, దాచి, గతిలేని బిచ్చగాళ్లకి అమృత రూపంలో పంచుతున్న సీతాలు!

దరిద్రాన్ని తరుముతామని స్లోగన్లు దంచుతూ, వోట్లడుగుతున్న నాయకులూ, నాయకీమణులు!

నోటమాట వెలువర్చకుండా - వున్న వాళ్లు పారేసినదాన్ని లేనివాళ్ల కడుపులకి పంచుతూ, సోదర మానవులపట్ల తన కర్తవ్యాన్ని (?) నెరవేర్చుకుంటున్న సీతాలు!

నలుగురికి పెట్టగలిగీ, నాలుగు బ్యాంకుల్లో అక్కవుంట్లు వోపెన్ చేసుకు వూరుకుంటున్న 'నేను'లు.

పాతబట్టలకొట్లో అమ్ముకోగలిగిన బట్టల్ని ఉచితంగా దానం చెయ్యటమేకాక, దాచుకున్న డబ్బులోంచి ఏటా దరిద్రులకి బనియను, కుట్టిపంచుతున్న సీతాలు—

మర్నాటి వుదయమేలేస్తూ, వన్ పర్సెంట్ డొనేషన్ నేను ప్రకటించ టమూ, మా ఆవిడ ప్రొటెస్ట్ చెయ్యా టమూ ఐనా నేను నా నిర్ణయం మార్చు కోకపోవటమూ జరిగాయి!

ఫస్ట్ వచ్చింది. పదినోటు తీసి, పక్క జేబులోకి తోశాను. అంతలో వచ్చేడు శంకర్రావ్.

"చూడండి, యీ మంత్ మీరో హండ్రెడ్ సర్దాలి నాకు. మా మిసెస్ డెలివరీ కదా! ఎన్ని ఖర్చులో "

తప్పలేదు. అతను నా కొలీగ్ ఇచ్చాను.

ఆ సాయంత్రం బడ్జెట్ లెక్కలు చూశాక, రెండో జేబులోని పది మళ్ళా మొదటి జేబులోకి చేరిపోయింది - ఆటో మేటిక్‌గా!

అవును, వున్నవాళ్ళూ, వున్నవాళ్ళూ ఒకటే! అయినా, బిచ్చగాళ్ల గురించి నాకెందుకూ బాధ? ఛెంగ? దేవుడే వాళ్ళ నలా సృష్టించాడు.

కాకపోయినా—

దీనుల కాపాడుటకు దీనులే వున్నారు-సీతాలులాంటివాళ్లు.

కాదంటారా? *